

వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు

పులివెందులలో వైఎస్ రాజారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. -8లో..



నాపరాయి పరిశ్రమకు పూర్వవైభవం

రాయల్టీ మినహాయింపుతో నాపరాయి పరిశ్రమకు పూర్వవైభవం రానుంది. -8లో..



కూతురితో పాటు బావిలో దూకిన తల్లి

గోపవరం మండలంలో కన్నబిడ్డను బావిలో తోసేసి తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది ఓ తల్లి. -8లో..

న్యూస్‌రీల్

27న మినీ ఫుట్‌బాల్ పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని సీఎస్ఐ మైదానంలో ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాస్థాయి మినీ ఫుట్‌బాల్ (6 ప్లేయర్స్) టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మినీ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17, సీనియర్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9052321062 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏపీ మోడల్ స్కూల్స్ డైరెక్టర్, పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. అభ్యర్థులకు జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు cse.ap.gov.in/apms.ap.gov.in సందర్శించాలన్నారు.

ముగిసిన ఈఏపీసెట్

కడప ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)- 2023 ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఈఏపీసెట్ మంగళవారంతో ముగిసింది. చివరిరోజు అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం కలిపి 3360 మందికి 3010 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి మంగళవారం తెలిపారు. ముందుగా వివరాలతో కూడిన సమాచారం కోసం https://cse.ap.gov.inలో చూడాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 7వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్‌కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా అప్లికేషన్ రుసుం చెల్లిస్తే నంబర్ కేటాయిస్తామని, దాని ఆధారంగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ మరియు ఈడబ్ల్యుఎస్‌లు రూ.200.. ఎస్సీ, ఎస్టీలు రూ.150 చెల్లించాలన్నారు.

నాడు చంద్రజాలం.. నేడు కార్యరూపం

- విభజన చట్టంలో ఉన్నా స్టీల్ ప్లాంట్ పట్ల అత్యంత నిర్లక్ష్యం
- ఆ ఐదేళ్లు మాటలతోనే కాలం గడిపిన చంద్రబాబు సర్కార్
- ఎన్నికల గడువు సమీపించడంతో హడావుడిగా 2018 డిసెంబర్ 27న శంకుస్థాపన
- అధికారంలోకి రాగానే ఆచరణలో చిత్తశుద్ధి చూపిన వైఎస్ జగన్ సర్కార్
- జిందాల్ నేతృత్వంలో కొనసాగుతున్న స్టీల్ ప్లాంట్ పనులు
- రూ.725 కోట్లతో మౌలిక వసతులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం



మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద స్టీల్ ప్లాంట్‌కు వేసిన పైలాన్ వద్ద అప్పటి సీఎం చంద్రబాబు (ఫైల్)



ఈ ఏడాది ఫిబ్రవరిలో స్టీల్ ప్లాంట్ భూమి పూజ సందర్భంగా నమూనా పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: అధికారంలో ఉన్నన్నాళ్లు మాటల మాయాజాలంతో పబ్బం గడపడం. అధికారం కోల్పోతే ప్రజల చెంతకు వెళ్లి బీరాలు పలకడం. ఇదీ టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహార శైలి. ఇప్పుడు అదేబాటలో ఆయన తనయుడు నారా లోకేష్ పయనిస్తున్నారు. ఆచరణలో చిత్తశుద్ధి లోపించి ప్రజలు ఛీత్కరించినా.. మరోమారు మేమైతే అంటూ బీరాలు పలుకుతూ గ్రామాల్లో తిరుగుతున్నారు. బుధవారం జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్ర ప్రవేశించనుంది. ఆ నియోజకవర్గంలో ప్రధానంగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం టీడీపీ వైఖరికి నిదర్శంగా నిలుస్తోంది.

- రాష్ట్ర విభజన చట్టంలో కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ చిత్తశుద్ధి ప్రదర్శించి ఉక్కు పరిశ్రమ కోసం తపించింటే చరిత్ర మాటగట్టుకునేది. ఎన్నికలు సమీపించే కొద్దీ హడావుడి కార్యక్రమాలు చేపట్టడం, అధికారంలో ఉంటే మాటల గారడీతో ఊదరగొట్టడం ఇదే చంద్రబాబుకు తెలిసిన విద్యగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అచ్చం అదేవిధంగా ఉక్కు పరిశ్రమ పట్ల టీడీపీ సర్కార్ వైఖరి ప్రస్ఫుటమైంది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్య పార్టీగా టీడీపీ ఉంటూ విభజన చట్టానికి తూట్లు పొడిచింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని చట్టంలో పొందుపర్చినా అమలు చేయడంలో అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శించిందని పలువురు ఎత్తిచూపుతున్నారు.

ఎన్నికలకు ముందు శంకుస్థాపనతో సరి....

2019 ఏప్రెల్ 11న జనరల్ ఎలెక్షన్స్ రాష్ట్రంలో నెలకొన్నాయి. 2018 డిసెంబర్ 27న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామం వద్ద సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అంటే ఎన్నికలకు 3 నెలలు ముందుగా శంకుస్థాపన చేపట్టారు. ఐదేళ్ల కాలం కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నా ఉక్కు పరిశ్రమ పట్ల చిత్తశుద్ధి చూపెట్టలేదు. కాగా ఎన్నికల గడువు సమీపించే కొద్దీ ఆ పరిశ్రమ ఆవశ్యకత టీడీపీకి గుర్తుకు వచ్చింది. టీడీపీ అనుకూలురు అదే రాజకీయం అంటే అని చెప్పుకొస్తుంటే, యదార్థవాదులు పచ్చి అవకాశవాద రాజకీయంగా చెప్పుకొస్తున్నారు.

చిత్తశుద్ధితో వ్యవహరించిన వైఎస్ జగన్ ప్రభుత్వం

వెనుకబడిన రాయలసీమలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నమ్మింది. అధికారంలోకి వచ్చిన 6 నెలలకు 2019, డిసెంబర్ 23న ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ పేరిట నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు. రెండు నెలలు తిరక్కమునుపే 2020 ఫిబ్రవరి నుంచి కరోనా వైరస్ యావత్తు ప్రపంచాన్ని గడగడలాడించింది. మానవజీవనం అస్తవ్యస్తంగా మారింది. బతుకు జీవుడా అంటూ తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండేళ్ల పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగుతూ రావడంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిబంధకంగా మారిందని పరిశీలకులు వివరిస్తున్నారు.

నాడు నాటకీయ పరిణామం

కేంద్ర ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకుంటూనే రాష్ట్రంలో టీడీపీ స్టీల్ ప్లాంట్ కోసం నాటకీయ పరిణామాలకు తెరలేపింది. 2018 జూన్ 25న కడప జడ్పీ ప్రాంగణం వేదికగా అప్పటి టీడీపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ నాయుడు, అప్పటి ఎమ్మెల్సీ బీటెక్ రవిలచే నిరశన దీక్ష చేయించారు. ఆ దీక్ష ఫోకస్ కోసం చంద్రబాబు సర్కార్ తాపత్రయం పడింది. అప్పటి సీఎంఓ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌కు డైరెక్షన్ చేస్తూ సక్సెస్ కోసం జిల్లా కేంద్రంలోని కళాశాల విద్యార్థులను దీక్ష ప్రాంగణానికి వంతులవారిగా తరలించేవారు. వారం రోజులు నాటకీయ దీక్ష చేపట్టిన తర్వాత విరమింపజేశారు. వెంటనే చంద్రబాబు సర్కార్ ఆచరణలోకి వెళ్లిందా అంటే, అదీ లేదని పరిశీలకులు అంటున్నారు.

జెఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్‌తో నిర్మాణం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి 2023 ఫిబ్రవరి 15న భూమి పూజ చేశారు. ఎకరం రూ.1.65 లక్షలతో 3,148.68 ఎకరాలు కేటాయిస్తూ 2022 డిసెంబర్ 16 ఉత్తర్వులు జారీ చేశారు. తొలివిడతలో ఏడాదికి 1 మిలియన్ టన్నులు ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం తలపెట్టారు. ఫేజ్-1లో రూ.3,300 కోట్లుతో వైర్ రాడ్స్, బార్‌మిల్స్ ఉత్పత్తి చేసేందుకు పనులు చేపట్టారు. ఫేజ్-2లో మరో రూ.5,500 కోట్లుతో మార్చి 31, 2029 నాటికి పూర్తి చేసేందుకు 3 మిలియన్ టన్నులు ఉత్పత్తి సామర్థ్యంతో ప్రణాళికలు రూపొందించారు. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.750 కోట్లుతో మౌళిక వసతులు, కనెక్టివిటీ, నీటి పైపులైన్, నిల్వ చేసుకునే సంప్, విద్యుత్, రైల్వే లైన్ వసతి సైతం ఏర్పాటు చేసి ఆచరణలో చిత్తశుద్ధి ప్రదర్శించింది. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండేళ్లకు ఉత్పత్తి చేపట్టాలనే లక్ష్యంతో నిర్మాణ పనులు వేగవంతంగా నడుస్తుండడం విశేషం.

లోకేష్‌కు పర్యటించే అర్హత లేదు...



జమ్మలమడుగు నియోజకవర్గంలో నారా లోకేష్‌కు పాదయాత్ర చేసే అర్హతే లేదు. విభజన చట్టంలో పొందుపర్చిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు కనీస చొరవ చూపలేదు. ప్రజల్ని మభ్యపెట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతోనే పాదయాత్ర చేస్తున్నారు. – ఎం హనుమంతురెడ్డి, జమ్మలమడుగు

శిలాఫలకంతో సరిపెట్టారు



టీడీపీ ప్రభుత్వం ఉండగా చంద్రబాబు అనేక పర్యాయాలు ఉక్కు పరిశ్రమ కోసం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. తుదకు ఎన్నికలకు ముందు శిలాఫలకంతో సరిపెట్టారు. సీఎం వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి ఉండడంతోనే పరిశ్రమ భూమిపూజ నాటికే మౌళిక వసతులు కల్పించారు. – వి హృషికేశవరెడ్డి, జమ్మలమడుగు

సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మొత్తం 26,686 మంది విద్యార్థులు పరీక్షను రాయనున్నారు. మొదటి సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ప్రతి రోజు రెండు పూటల పరీక్షలను నిర్వహించనున్నారు. విద్యార్థులంతా తమకు నిర్ణయించిన పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలి. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమరాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఒక హై పవర్ కమిటీతో పాటు పలువురిని నిఘా కోసం నియమించారు.

అన్ని సౌకర్యాలు కల్పించాం

ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశాము. విద్యార్థులకు ఏదైనా సమస్య ఏర్పడితే ఫిర్యాదు చేసేందుకు వీలుగా కడప ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 08562- 244171 నంబర్‌ను ఏర్పాటు చేశాం. విద్యార్థుల తల్లిదండ్రులు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దు. – రమణరాజు, ఆర్ఐవో, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్

అక్రమాల రోగానికి చికిత్స



ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎం శిక్షణ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి సోకిన పాలనా పరమైన నిర్లక్ష్యంతో పాటు అవినీతి, అక్రమాల జబ్బుకు చికిత్స ప్రారంభమైంది. సాక్షి వరుస కథనాల నేపథ్యంలో అమరావతిలో అడిషనల్ డైరెక్టర్ (మాతా శిశు సంరక్షణ)గా పనిచేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ ప్రత్యేకంగా ఇక్కడ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. శాఖా పరమైన లోపాలపై దృష్టి సారించారు. ఆ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కార్యాలయ వ్యవహారాలపై ఆరా తీశారు. అలాగే స్టాఫ్ నర్స్ నియామకాల్లో వెలుగు చూసిన బోగస్ సర్టిఫికెట్స్‌కు సంబంధించిన పత్రాలను పోలీసులకు అందజేశారు. మిగతా సెక్షన్లలో జరిగిన లోపాలపై సమీక్షించారు.

23 మందికి జీఎన్‌ఎం శిక్షణకు కౌన్సెలింగ్

మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని 23 మంది ఏఎన్‌ఎంలకు జీఓన్‌ఎం శిక్షణను పొందడానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. రీజినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఏఎన్‌ఎంల జీఎన్‌ఎం శిక్షణకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను చేపట్టామన్నారు.

పథకాలను విజయవంతం చేయాలి

కడప రూరల్: ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్య ఇస్తోందని.. గర్భిణీలు, బాలింతలు, శిశు సంరక్షణ తదితర ఆరోగ్య పథకాలను విజయవంతంగా అమలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ ఖాదర్‌వలి, కొండయ్య, ఆ శాఖ సిబ్బంది డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, లక్ష్మీకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఖాతా లేకున్నా రూ.2 వేల నోట్ల మార్పిడి



కడప కోటిరెడ్డిసర్కిల్ : రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు రెండు వేల రూపాయల నోట్లు మార్చుకునేందుకు బ్యాంకులో ఖాతా ఉండాల్సిన అవసరం లేదని, ఏ బ్యాంకులో అయినా రోజుకు రూ. 20 వేల వరకు మార్చుకోవచ్చని ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తెలిపారు. బ్యాంకుల్లో ఆధార్ వివరాలు నమోదు చేసుకుని రూ.2 వేల నోట్లకు బదులుగా ఇతర నోట్లు ఇస్తారన్నారు. బ్యాంకు ఖాతాలకు పాన్‌కార్డు లింక్ అయి ఈకేవైసీ చేసుకుని ఉంటే బ్యాంకు ఖాతాలో రూ.2 వేల నోట్లు ఎంత మొత్తమైనా డిపాజిట్ చేసుకునే వీలుందన్నారు. అలాగే ఈ నోట్ల మార్పిడికి మాత్రం రోజుకు 10 నోట్లు అంటే రూ.20 వేల వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

పురాలకు మహర్దశ

- వైఎస్సార్, అన్నమయ్యజిల్లాల్లోని మున్సిపాలిటీలకు రూ.475.68 కోట్ల నిధులు
- దేవుని కడప చెరువు సుందరీకరణకు రూ.68.45 కోట్లు
- కడప నగరానికి రూ.217.2 కోట్లు
- పీహెచ్ఎంఈడీ, ఏపీజీబీసీ ద్వారా పనులు



కడప కార్పొరేషన్ కార్యాలయం

బి.కొత్తకోట: అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని నగరాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి సరఫరా, పనుల అభివృద్ధి, జగనన్న కాలనీలకు నీటి వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులను కేటాయించి పనులకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. పై రెండుజిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనుల కోసం రూ.475.68 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కొన్ని చెరువుల సుందరీకణ పనులకు అనుమతులు ఇచ్చారు. కేంద్రప్రభుత్వ వాటా నిధులు కలుపుకుని ప్రభుత్వం నిధులు ఇచ్చింది. అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్థానిక మున్సిపాలిటీలకు కొద్దిపాటి వాటాను కలిపి మొత్తం నిధులు కేటాయించారు. ఈ పనులను మున్సిపల్‌శాఖకు చెందిన ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ, ఏపీ గ్రీనరీ బోర్డు కార్పొరేషన్ చేపట్టనున్నాయి.

నిధుల్లో కడపకు అగ్రస్థానం

నిధుల కేటాయింపులో కడప నగరానికి అత్యధిక నిధులు కేటాయించారు. నగరానికి చెందిన జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా వారికి నీటి సరఫరా పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. హౌసింగ్ కాలనీలో నీటి వసతులకు రూ.37.23 కోట్లు కేటాయించారు. నగరంలో తాగునీటి పథకాల అభివృద్ధి, పైప్‌లైన్ల ఏర్పాటు, ఇతర పనులకు రూ.110.76 కోట్లు, మురికివాడల్లో మురికినీటి వ్యవస్థ కోసం రూ.69.21 కోట్లు కేటాయించారు.

మిగతా మున్సిపాలిటీల్లో..

బి.కొత్తకోట నగర పంచాయతీలో రూ.2.7 కోట్లతో తాగునీటి పనుల అభివృద్ధి, సంపు పైప్‌లైన్ పనులకు కేటాయించారు.

- మదనపల్లె మున్సిపాలిటిలో జగనన్నకాలనీల్లో నీటి సరఫరాకు రూ.5.64 కోట్లు, తాగునీటి సరఫరా పథకాల అభివృద్ధికి రూ.17.65 కోట్లు, మురికినీటి వ్యవస్థ కోసం రూ.6.95 కోట్లు కేటాయించారు.
- రాజంపేటలో తాగునీటికి రూ.30.12 కోట్లు, బద్వేలులో హౌసింగ్ కాలనీలో నీటి వసతులకు రూ.18.8 కోట్లు, నీటి సరఫరా సౌకర్యాల మెరుగుకు రూ.68.46 కోట్లు కేటాయించారు.
- జమ్మలమడుగులో నీటి సరఫరా పథకాల అభివృద్ధికి రూ.10.91 కోట్లు, పులివెందులలో హౌసింగ్ కాలనీకి నీటి వసతులకు రూ.24 లక్షలు, మైదుకూరులో హౌసింగ్ కాలనీకి నీటి సరఫరాకు రూ.3.96 కోట్లు మంజూరు చేశారు.

చెరువుల సుందరీకరణ

రెండు జిల్లాల పరిధిలోని చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు.

- బి.కొత్తకోట పెద్దచెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు, కడప నగరంలోని దేవుని కడప చెరువు అభివృద్ధి, సుందరీకరణ, ఇతర పనులు చేపట్టడం కోసం రూ.68.45 కోట్లు మంజూరు చేశారు. పుట్లంపల్లి చెరువుకు రూ.15 కోట్లు, మైదుకూరులోని శెట్టివారిపల్లె చెరువుకు రూ.2.20 కోట్లు, బద్వేలులోని నాగులచెరువుకు రూ.2.20 కోట్లు, రాయచోటిలోని మాండవ్యనది సుందరీకరణకు రూ.1.60 కోట్లు, చక్రాలమడుగు చెరువుకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు.

గొడవ కేసులో ఏడాది జైలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని పొలం దారి విషయంలో జరిగిన గొడవలో జిల్లెల చంద్రశేఖర్‌రెడ్డికి ఏడాది పాటు జైలు శిక్ష, రూ.50 వేల జరిమానాను కోర్టు విధించింది. ఈ వివరాలను ఎర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. పొలం దారి విషయంపై జిల్లెల్ల శ్రీనివాసులరెడ్డి, చెమికల చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లెల చంద్రశేఖర్‌రెడ్డి రాళ్లు, రాడ్లుతో కొట్టి గాయపరిచారు. జిల్లెల శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు మేరకు 2015లో అప్పటి ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిపారు. జిల్లెల్ల చంద్రశేఖర్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో.. జడ్జి బి.శివప్రసాద్‌యాదవ్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో మరో రెండు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు. ఈ కేసును అడిషినల్ పీపీబీ ఓబులేసు వాదించారు. సీఐ, ఎస్ఐ, కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ అభినందించారు.

నాపరాయి పరిశ్రమకు పూర్వవైభవం

- ప్రభుత్వ ఆదేశాలతో రాయల్టీ మినహాయింపు
- గోడరాళ్లకు పూర్తిగా రద్దు
- మిగతా వాటికి టన్నేజీపై రూ.110 తగ్గింపు



ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న నాపరాయి పరిశ్రమ యజమానులు

ఎర్రగుంట్ల : రాయల్టీ మినహాయింపుతో నాపరాయి పరిశ్రమకు పూర్వవైభవం రానుంది. గోడరాళ్లకు పూర్తిగా రద్దు చేశారు. మిగతా వాటికి టన్నేజీపై రూ.110 తగ్గించారు. ఈ నేపథ్యంలో ఎర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాపరాయి పరిశ్రమ యజమానులు, మైనింగ్ రాయల్టీని వసూలు చేసే ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమకు గుదిబండగా మారిన మైనింగ్ రాయల్టీని మినహాయింపు చేసి పూర్వ వైభవం వచ్చే విధంగా ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి కృషి చేశారని ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమ అసోసియేషన్ ఈ సందర్భంగా పేర్కొంది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమకు దేశ, విదేశాలలో గుర్తింపు ఉందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. అయితే ప్రస్తుతం మైనింగ్ రాయల్టీ వసూలును ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించిందన్నారు. దీంతో ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమ కొంత గడ్డు సమస్యను ఎదుర్కొందన్నారు. సుమారు 15 వేల మందికి పైగానే ఉపాధిని ఈ పరిశ్రమ కల్పిస్తుందన్నారు. రాయల్టీని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ నాపరాయి పరిశ్రమ యజమానులు కోరిన మేరకు ఈ విషయంపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి చాలా సార్లు చర్చించామన్నారు. తర్వాత ఎంపీ ప్రత్యేక చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. సీఎం ఆదేశాలతో ప్రభుత్వం గోడరాళ్లకు పూర్తిగా రాయల్టీని మినహాయింపు చేసి, మిగతా వాటిపై టన్నేజీపై సుమారు రూ.110 రాయల్టీని తగ్గింపు చేశారన్నారు. గత మూడు నెలలుగా ఈ సమస్యపై పోరాడి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో విజయం సాధించామన్నారు. ఇది చరిత్రలో గుర్తుండి పోతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పులివెందుల ఎంతో ముఖ్యమో, ఎర్రగుంట్ల కూడా అంతే ముఖ్యమన్నారు. రాయల్టీని వసూలు చేసే ప్రతినిధులు కూడా చాలా సహకరించారన్నారు. ఈ సందర్భంగా రాయల్టీ ప్రతిధులు శ్రీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ప్రత్యేక కృషి వల్లనే రాయల్టీని గోడరాళ్లకు మినహాయించి, మిగతా వాటికి రూ.110 వసూలు చేయడానికి నిర్ణయించుకున్నామన్నారు. రోజూ ఈ విషయంపై ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి తమతో చర్చిస్తున్నారని, చివరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు తగ్గించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలను నాపరాయి అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డితోపాటు రాయల్టీ ప్రతినిధులు, నాపరాయి పరిశ్రమ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

శుభపరిణామం



ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి కృషి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాయల్టీ మినహాయింపు వల్ల నాపరాయి పరిశ్రమకు శుభపరిణామం జరిగింది. వేలాది మందికి నాపరాయి పరిశ్రమ ఉపాధి ఇస్తుంది. ఇలాంటి పరిశ్రమను కాపాడటం వల్ల ఎంతో మందికి ప్రయోజనం. **– మూలె హర్షవర్ధన్‌రెడ్డి,** మున్సిపల్ చైర్మన్, ఎర్రగుంట్ల

గట్టెక్కిన నాపరాయి పరిశ్రమ



రాయల్టీ మినహాయింపుతో ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమ గట్టెక్కింది. ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రాయల్టీని మినహాయింపు చేశారు. ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమ యజమానులను విజయవాడకు పిలుచుకుని వెళ్లి సంబంధిత మంత్రితో కూడా మాట్లాడి సమస్యను పరిష్కరింప చేశారు. ఎర్రగుంట్లను కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. **– రాజారెడ్డి,** నాపరాయి పరిశ్రమ యజమాని, నిడుజివ్వి

గోడరాళ్లకు పూర్తిగా మినహాయింపు.. ఎంతో సంతోషం



నాపరాయి పరిశ్రమలో భాగమైన గోడరాళ్లకు పూర్తిగా రాయల్టీని మినహాయింపు చేయడం ఎంతో సంతోషకరం. ఈ చిన్న గోడరాళ్ల సరఫరాపై ఎంతో మంది ఆధార పడి జీవిస్తున్నారు. ట్రాక్టర్లను పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. రాయల్టీని తొలగించడంతో మళ్లీ గోడరాళ్లకు పూర్వ వైభవం వచ్చింది. **– సోమిరెడ్డి, ఎస్ఎం బాషా,** నాపరాయి పరిశ్రమ యజమానులు, ఎర్రగుంట్ల

దోపిడీ దొంగల కోసం పోలీసుల వేట

కడప కోటిరెడ్డిసర్కిల్ : కమలాపురం సమీపంలో ఇటీవల జరిగిన రైలు దోపిడీ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తూ, దొంగల కోసం వేట కొనసాగిస్తున్నారు. గతంలో ప్రొద్దుటూరు, ఆదోని ప్రాంతాల్లో జరిగిన రైలు దోపిడీల్లాగానే కమలాపురం వద్ద జరిగిన దోపిడీ కూడా అలాంటిదేనని భావిస్తున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన ముఠా సభ్యులు దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా రైలు దోపిడీకి పాల్పడేది ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారేనని వారు అంచనా వేస్తున్నారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ షాక్‌తో సర్పంచ్ మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండా జగదీశ్వర్‌రెడ్డి అలియాస్ బాబురెడ్డి (54) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్వగ్రామమైన కుర్రావాండ్లపల్లిలోని ఇంటి ఎదుట నీటి సంపు మోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ పంచాయతీలో అందరి మన్ననలు పొందిన బాబురెడ్డి గతంలో రెండు సార్లు సర్పంచ్‌గా ఎన్నిక కాగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా గత నెల 14న సంపతికోట పంచాయతీ కానుగమాకులపల్లిలో జరిగిన గృహ ప్రవేశంలో షామియానా గాలికి లేచి పైనున్న విద్యుత్ తీగలు పడటంతో నలుగురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇదే శుభ కార్యానికి హాజరైన బాబురెడ్డి ఘటనా స్థలంలోనే విద్యుత్ షాక్ బారి నుంచి ఆరుగురిని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. అయినా కూడా ఆయన అర్ధాంతరంగా విద్యుత్ షాక్‌తో మృతి చెందడాన్ని గ్రామ పంచాయతీ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



మల్లయ్య మృతదేహం

పులివెందుల రూరల్ : ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడి ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం మండలం పెద్దచెప్పలికి చెందిన మల్లయ్య (45) పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం పులివెందుల వచ్చాడు. అక్కడ ప్రశాంతి నగర్‌లో నివాసముండే వాడు. కోళ్లకు సంబంధించిన వ్యాన్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ పని చేసే వాడు. మంగళవారం కూడా అదే విధంగా అన్‌లోడింగ్ చేసి తిరిగి పులివెందులకు వస్తుండగా.. మార్గంమధ్యలో రాణి తోపు వెనుకవైపు ఉన్న లింగాల కుడికాలువలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. అతన్ని రక్షించేందుకు మరో వ్యక్తి ప్రయత్నం చేశాడు. కానీ అంతలోనే మల్లయ్య మునిగిపోయాడు. అటువైపు వెళుతున్న మరో వ్యక్తి కాలువలోకి దిగి మల్లయ్యను బయటకు తీశాడు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

ఘర్షణ.. ఇద్దరికి గాయాలు





గాయపడ్డ వినోద్, మణి

పులివెందుల రూరల్ : పులివెందులలో డబ్బుల విషయమై ఘర్షణ జరగడంతో.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ హుస్సేన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నగరిగుట్ట ఎస్సీ కాలనీకి చెందిన రత్నాకర్ అలియాస్ గుల్లో నగరిగుట్టలోనే నివసిస్తున్న వినోద్‌కు రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులు ఇవ్వాలని వినోద్.. రత్నాకర్ ఇంటికి వెళ్లి అడిగాడు. అక్కడ రత్నాకర్, వినోద్ మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురు ఘర్షణ పడ్డారు. అదే సమయంలో ఇంటిలో ఉన్న రత్నాకర్ మిత్రుడు మణి వేట కొడవలితో వినోద్ భుజంపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో మణికి స్వల్ప గాయాలయ్యాయి. వినోద్‌ను పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న వినోద్ బంధువులు రత్నాకర్ ఇంటిపై దాడి చేసి సామాన్లు ధ్వంసం చేశారు. అలాగే నాలుగు బైకులను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. చుట్టు పక్కల వారు సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల విద్యా పీఠానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో గురుకుల విద్యా పీఠం స్కూలు ఏర్పాటుకు స్థలాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని రచ్చుమర్రిపల్లె గ్రామ సమీపంలోని 69, 70, 71, 72 సర్వే నంబర్లలో ఉన్న 11.92 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల విద్యా పీఠం స్కూలు ఏర్పాటుకు పులివెందులలో స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. విద్యాపీఠం స్కూలు ఏర్పాటుకు రచ్చుమర్రిపల్లె గ్రామంలో స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే గురుకుల విద్యాపీఠం స్కూలు పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, సర్వేయర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా పశుసంవర్ధక అధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్ : పశు బీమా పథకాన్ని పాడిరైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకదార్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. స్థానికంగా ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఈ పథకం వైఎస్సార్ పశు నష్టపరిహారం కింద కొనసాగిందని, ప్రస్తుతం పశుబీమా పథకం (లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్)గా మార్పు జరిగిందన్నారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్(బిలో ప్రాపర్టీ లైన్) లబ్ధిదారుల వాటా 20 శాతం, ఏపీఎల్(అబవ్ ప్రాపర్టీ లైన్) లబ్ధిదారుని వాటా 50 శాతంగా నిర్ణయించారన్నారు. ఈ పథకంలో గరిష్టంగా 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలకు పశుబీమా చేసుకునేందుకు వీలు కల్పించారన్నారు. రూ. 30 వేలు ఖరీదు చేసే గేదె లేదా ఆవుకు మూడేళ్లకు ప్రీమియం 6.4 శాతం రూ.1920గా నిర్ణయించడమైందన్నారు. అందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.384, ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.960 తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.15 వేలు ఖరీదు చేసే గేదె లేదా ఆవుకు మూడేళ్ల ప్రీమియం రూ.960, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌కు 6.4 శాతం రూ.192 , ఏపీల్ లబ్ధిదారులు రూ.480 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.6 వేల గొర్రె, మేక, పందులకు ఏడాది మొత్తం ప్రీమియం 3 శాతం రూ.180 నిర్ణయించామన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.36, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.90 వాటాగా చెల్లించాలన్నారు. రూ. 6 వేల గొర్రె, మేక, పందులకు మొత్తం ప్రీమియం రెండేళ్లకు 4.5 శాతంగా రూ.270గా నిర్ణయించడం జరిగిందన్నారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్‌కు రూ.54, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.135 తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడేళ్లకు ప్రీమియం 6.25 శాతం రూ.375, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.75, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.187.50 తమ వాటాగా చెల్లించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో లేదా పశు వైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు.

యూపీఎస్సీ ఫలితాల్లో కడప కుర్రాడి ప్రతిభ

– సివిల్స్ ఫలితాల్లో 866వ ర్యాంకు

తల్లిదండ్రులతో నాగుల కృపాకర్

వైవీయూ : వైఎస్సార్ జిల్లా కడప నగరం ప్రకాష్‌నగర్‌కు చెందిన నాగుల రామకృష్ణ (ఆంగ్ల అధ్యాపకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెండ్లిమర్రి), లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నాగుల కృపాకర్ యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లో 866వ ర్యాంకు సాధించాడు. కడపలోని నాగార్జున మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి వరకు ఈయన విద్యాభ్యాసం కొనసాగగా, హరితవర్స్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. ఎంసెట్‌లో సైతం 2వేలు ర్యాంకు సాధించి తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీటెక్ ఈఈఈ పూర్తి చేశాడు. అనంతరం సివిల్స్ సాధనే ధ్యేయంగా సన్నద్ధమయ్యాడు. ఒకటి కాదు..రెండు కాదు.. వరుసగా ఐదు సార్లు ఆశించినా తగిన ఫలితం రాలేదు. అయితే నిరుత్సాహానికి లోనుకాకుండా, పట్టువదలని విక్రమార్కుడిలా 6వసారి ప్రయత్నం చేశాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో కొంతకాలం శిక్షణ తీసుకున్న అనంతరం సొంతంగా ప్రిపరేషన్ సాగించాడు. తాజా ఫలితాల్లో 866వ ర్యాంకు సాధించాడు. దీంతో ఈయనకు ఐపీఎస్ లేదా ఐఆర్ఎస్ వచ్చే అవకాశం ఉంది. కాగా, ఈయన సోదరి చైతన్య గతంలో గ్రూప్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఏసీటీఓగా ఎంపికై ప్రస్తుతం తిరుపతిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా నాగుల కృపాకర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత మంచి ర్యాంకు సాధించేందుకు ప్రిపరేషన్ కొనసాగిస్తానని, ఉన్నత కొలువు సాధించి ప్రజలకు సేవచేయాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు.

కూతురితో పాటు బావిలో దూకిన తల్లి

ఇద్దరూ మృతి



మృతిచెందిన తల్లి, కూతురు

గోపవరం : పాపం ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో తెలియదు కాని నవమాసాలు మోసి కనిపెంచిన కన్నబిడ్డను బావిలో తోసేసి తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వైఎస్సార్ జిల్లా గోపవరం మండలంలోని చెన్నవరం దళితవాడలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మనేపల్లె ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కుమార్తె మంజుల (30)ను పది సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం మంచాలపల్లె గ్రామానికి చెందిన మేనమామ చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. వీరికి 7 సంవత్సరాల బాబు, 5 సంవత్సరాలు, సంవత్సరంలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మంజుల 20 రోజుల క్రితం భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. కుటుంబ సభ్యులందరితో కలిసి బాగానే ఉండేవారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ, మంగళవారం తన రెండో కుమార్తె రాజేశ్వరి (5)ని తీసుకుని దళితవాడకు సమీపంలో ఉన్న బావిలో దూకింది. తల్లికూతురు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించగా కొద్దిసేపటి క్రితమే బిడ్డను తీసుకుని చెరువు వైపు వెళుతున్నట్లు చూసిన వారు చెప్పడంతో కుటుంబ సభ్యులు, దళితవాడ ప్రజలు చెరువు వద్దకు పరుగులు తీయగా అక్కడే బావి గడ్డపై మంజుల చెప్పులు ఉండటంతో బావిలో దూకినట్లు నిర్ధారించుకున్నారు. స్థానికులు బావిలో దూకి గాలించగా పాప మృతదేహం లభించింది. తల్లి కోసం గాలించగా ఎంతసేపటికి ఆచూకీ లభించకపోవడంతో బద్వేలు రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది బావిలో గాలించి మంజుల మృతదేహం కూడా వెలికి తీశారు. పాలు తాగే చంటిబిడ్డను ఇంటిలో వదిలేసి మరో బిడ్డను తీసుకుని తల్లి బావిలో దూకి చనిపోవడం అటు కుటుంబ సభ్యులను, ఇటు గ్రామస్తులను కలిచివేసింది. చంటిబిడ్డ ఆక్రందనను చూసి అందరూ కంట తడి పెట్టారు. భర్త కూలీ పని చేసుకుంటూ భార్య, పిల్లలను పోషించుకునేవాడు. మృతురాలి తండ్రి మతిస్థిమితం లేక గ్రామాల్లో తిరుగుతుంటాడు. ఇంతలోనే ఈ విషాదం జరగడంతో ఒక్కసారిగా దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు



వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు

పులివెందుల : వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడని దివంగత సీఎం వైఎస్సార్ సతీమణి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ.. దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పులివెందులలోని డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో దివంగత వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మల సమాధుల వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ పాస్టర్లు ఆనందబాబు, నరేష్‌కుమార్, మృత్యుంజయలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డిల సమాధులతో పాటు ఇతర బంధువుల సమాధుల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ రాజారెడ్డి సమాజానికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా, అంబకపల్లె నారాయణస్వామి, వెంగమునిరెడ్డి, పార్నపల్లె నాయుడులతో పాటు వైఎస్సార్ కుటుంబ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.